సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 7 । జనవరి । 2024



భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు
కేతేపల్లి మండల కేంద్రంలోని మేరి జప మాల మాత చర్చిలో క్రీస్తు సాక్షాత్కార ఉత్సవాలు కొనసాగుతున్నాయి. - 8లో



అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం
అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 9లో



స్వాతి నక్షత్ర పూజలు
యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం స్వాతి నక్షత్ర పూజలను కనుల పండువగా నిర్వహించారు. - 10లో

ప్రజాపాలన దరఖాస్తులు 2,64,922

ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి పథకాలకు భారీగా..

- ముగిసిన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ
- మొదలైన ఆన్‌లైన్ నమోదు
- 525 కౌంటర్లు, 562 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు
- ఈ నెల 17వ తేదీలోగా పూర్తి చేసేలా కార్యాచరణ



భువనగిరిలో ఐదు గ్యారంటీ స్కీంలకు దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

సాక్షి,యాదాద్రి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి జిల్లాలో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఐదు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. డిసెంబర్ 28 నుంచి ఈనెల 6వ తేదీ వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహించిన అధికారులు.. ఐదు సంక్షేమ పథకాల అమలుకోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో అభయహస్తం కింద ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి పథకాలకు ఆ తర్వాత నూతన రేషన్‌కార్డులకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 2,64,922 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రజాపాలనలో ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును శనివారం ప్రారంభించారు. ఈ ప్రక్రియను ఈనెల 17న పూర్తి చేయాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వివరాలు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం, ఆ సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై డేటా ఆపరేటర్లకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. అనంతరం ఆపరేటర్లు మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందుకోసం 525 కౌంటర్లు ఏర్పాటు చేశారు. 562 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. పరిశీలనకు రెవెన్యూ, వ్యవసాయ, విద్య, వైద్య, విద్యుత్, పౌర సరఫరాల శాఖల అధికారులతో ఎంపీడీఓలు, తహసీల్దార్ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

దరఖాస్తు చేయలేదా.. ఆందోళన వద్దు

వివిధ కారణాల వల్ల చాలా మంది ప్రజాపాలనలో దరఖాస్తులు ఇవ్వలేకపోయారు. అలాంటి వాళ్లు ఆందోళన చెందవద్దని అధికారులు సూచిస్తున్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్,గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తులు అందజేసే అవకాశం ఇచ్చారు.

సభలు, దరఖాస్తులు ఇలా.. జిల్లాలో 421 గ్రామ పంచాయతీలు, ఆరు మున్సిపాలిటీల్లో 525 సభలు నిర్వహించారు. ఆలేరు నియోజకవర్గంలో 210, భువనగిరి నియోజకవర్గంలో 175, మునుగోడులో 80, తుంగతుర్తిలో 39, నకిరేకల్‌లో 21 సభలు జరిగాయి. ఆయా సభల ద్వారా 2,64,922 దరఖాస్తులు వచ్చాయి. శనివారం ఒక్క రోజే 52 గ్రామ సభలు నిర్వహించగా 42,986 మంది దరఖాస్తు చేసుకున్నారు. 90 శాతానికి పైగా కుటుంబాలు ఐదు గ్యారంటీ పథకాల్లో ఏదో ఒకదానికి దరఖాస్తు చేసుకున్నాయి.

న్యూస్‌రీల్

పర్మనెంట్ జియోట్యాగ్ ఇవ్వాలి



మాట్లాడుతున్న తిరందాసు ధనుంజయ

మోత్కూరు : చేనేత కార్మికులకు తాత్కాలికంగా ఇస్తున్న జియోట్యాగ్‌లను క్రమబద్ధీకరించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్, రాష్ట్ర కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు తిరందాసు ధనుంజయ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మోత్కూరులోని మార్కండేయ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. నేతన్న బీమా పథకాన్ని 75 ఏళ్ల వయస్సు వరకు వర్తింపజేయాలని, చేనేత కార్మికుల తయారు చేసిన వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు ధనుంజయ్, గౌరవ అధ్యక్షుడు చుంచు నాగభూషణం, ప్రధాన కార్యదర్శి రాపోలు వీరమోహన్, మోత్కూరు చేనేత సంఘం నాయకులు గంగుల నర్సయ్య, పెండెం శ్రీను, పోచం సోమయ్య, కూరపాటి రాములు, ఎలగందుల సత్యనారాయణ, కొంగరి రాములు, పసునూరి రాములు, పసునూరి రమేష్ పాల్గొన్నారు.

రామన్నపేట ఎంపీపీపై 27న అవిశ్వాసం

రామన్నపేట : రామన్నపేట ఎంపీపీపై అవిశ్వాసానికి ముహూర్తం ఖరారైంది. ఈనెల 27న ఉదయం 11గంటలకు జరిగే సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలని మండలంలోని ఎంపీటీసీలకు ఆర్డీఓ జగన్నాథరావు శనివారం నోటీసులు జారీ చేశారు. ఎంపీపీ కన్నెబోయిన జ్యోతిపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ కాంగ్రెస్, సీపీఎంలకు చెందిన 10మంది ఎంపీటీసీలు ఈనెల 4న ఆర్డీఓకు సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. పంచాయతీరాజ్ చట్టం - 2018 ప్రకారం అవిశ్వాసం ప్రతిపాదనపై మండల ప్రజాపరిషత్ సమావేశం నిర్వహించేందుకు తేదీని నిర్ణయిస్తూ ఎంపీటీసీలకు ఆర్డీఓ నోటీసులు జారీ చేశారు.

క్యాంపులో నీలగిరి కౌన్సిలర్లు

నల్లగొండ : నల్లగొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లారు. ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ నెల 8న సైదిరెడ్డిపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి సమావేశం ఉండడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లనునా పార్టీ క్యాంపునకు తరలించింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లతోపాటు బీఆర్ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన వారిని కలుపుకుని అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు 34 మంది కౌన్సిలర్ల బలం ఇప్పుడు కాంగ్రెస్‌కు ఉంది. అయినా.. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత సూచన మేరకు కౌన్సిలర్లను హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని రిసార్ట్‌లకు తరలించినట్లుగా తెలుస్తోంది. క్యాంపు నుంచి నేరుగా ఈ నెల 8వ తేదీన నేరుగా అవిశ్వాస తీర్మాన సమావేశానికి కౌన్సిలర్లు హాజరు కానున్నారు.

మెస్ బిల్లులు విడుదల చేయాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భువనగిరిటౌన్ : మెస్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వనం రాజు మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు సుమారు రూ.5,485 కోట్లు మెస్ బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. ఐదు నెలలుగా మెస్ బిల్లులు రాకపోవడంతో వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా మెనూ ప్రకారం భోజనం అందించడానికి ఆటంకంగా మారిందన్నారు. హాస్టళ్ల పర్యవేక్షణ చూస్తున్న అధికారులు అప్పు తీసుకువచ్చి భోజనం పెడుతున్నారని పేర్కొన్నారు. పది, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో వెంటనే బిల్లులు విడుదల చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చింతల శివ, భువనగిరి పట్టణ అధ్యక్షుడు ఈర్ల రాహుల్‌తో పాటు ఎండీ నేహాల్, నాగారం శివ, ఈర్ల కార్తీక్, రామోజీ, రమణ ఉన్నారు.

తప్పులు లేకుండా నమోదు చేయాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే



మోత్కూరులో దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

మోత్కూరు, గుండాల, ఆత్మకూర్(ఎం) : ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు అందజేసిన దరఖాస్తులను తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. మోత్కూరు, గుండాల, ఆత్మకూర్(ఎం) మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును శనివారం ఆయన పరిశీలించారు. ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించాలని, దరఖాస్తులో పేర్కొన్న వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. దరఖాస్తుపై తప్పనిసరిగా నంబర్ వేయాలని సిబ్బందికి సూచించారు. ఆన్‌లైన్ పూర్తయిన దరఖాస్తులను జాగ్రత్తగా భద్రపరచాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రత్యేకాధికారులు యాదయ్య, మండల స్పెషల్ ఆఫీసర్ యాదయ్య, వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్లు రాంప్రసాద్, జలకుమార్, పార్థసింహారెడ్డి, ఎంపీడీఓలు పోరెడ్డి మనోహర్‌రెడ్డి, జి.శ్రీనివాసులు, నిరంజన్ ఎంపీఓ పైళ్ల జనార్దన్‌రెడ్డి, ఏఈఓలు క్రాంతి, రామ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

మోత్కూరు మున్సిపాలిటీలో..

మోత్కూరు మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన ఆన్‌లైన్ నమోదును మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం పరిశీలించి ఆపరేటర్లకు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్, మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా ప్రధాన జడ్జి జయరాజ్



జిల్లా ప్రధాన జడ్జిని సత్కరిస్తున్న న్యాయవాదులు

చౌటుప్పల్ : చట్టాలపై సామాన్యులు సైతం అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన జడ్జి జయరాజ్ పేర్కొన్నారు. చౌటుప్పల్‌లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టును శనివారం ఆయన సందర్శించారు. కేసుల విచారణ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ న్యాయవ్యవస్థను ప్రజలకు మరింతగా చేరువ చేయాలన్నారు. వీలైనంత త్వరగా కేసులకు పరిష్కారం చూపాలన్నారు. లోక్ అదాలత్‌లలో కేసుల రాజీ విషయంలో చౌటుప్పల్ కోర్టు ఉమ్మడి జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందని, అందుకు కృషి చేసిన స్థానిక న్యాయమూర్తి, న్యాయవాదులు, సిబ్బందిని అభినందించారు. మున్ముందు కూడా ఇదే ఒరవడి కొనసాగించాలని కోరారు. అనంతరం లక్కారం పరిధిలో నూతన కోర్టు భవన నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని జడ్జి పరిశీలించారు. భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకుముందు జడ్జి జయరాజ్‌ను స్థానిక కోర్టు న్యాయమూర్తి మహతివైష్ణవి ఆధ్వర్యంలో న్యాయవాదులు స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ జిల్లా చైర్మన్ కాట్రగడ్డ దశరథరామయ్య, న్యాయవాదులు వాకిటి నర్సింహారెడ్డి, ఎలమోని శ్రీనివాస్, బాల్యం వెంకటాచలపతి, తాడూరి పరమేష్, పి.పరమేష్, బగుడు శ్రీకాంత్, స్వాతి, శ్రీశైలం రవీందర్ తదితరులు ఉన్నారు.

అర్హులకు న్యాయ సహకారం

భువనగిరి క్రైం : క్రిమినల్, సివిల్ కేసుల్లో అర్హులైన వారికి న్యాయ సహకారం అందించే బాధ్యత న్యాయ సేవా సంస్థలపై ఉందని, ఇందులో ప్యానల్ న్యాయవాదుల పాత్ర కూడా ముఖ్యమైనదని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన జడ్జి జయరాజ్ పేర్కొన్నారు. భువనగిరి, రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల్ న్యాయ సేవా సంస్థలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన ప్యానల్, పారా లీగల్, జుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదుల సమావేశంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్యతో కలిసి ఆయన సమీక్షించారు. ఇంకా మెరుగైన సేవలు అందించాలని వారికి సూచించారు. జాతీయ న్యాయ సేవా సంస్థ రూపొందించిన న్యాయ సేవల పథకాలు అమలుచేయడంలో సహకారం అందజేయాలని కోరారు.

ఆకట్టుకున్న ఇన్నోవేటివ్ ఎక్స్‌పో



విజ్ఞాన్ కళాశాలలో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ దుర్గసుకుమార్, అధ్యాపకులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని దేశ్‌ముఖి గ్రామ పరిధిలోని విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇన్నోవేటివ్ ఎక్స్‌పో-2024 ఆకట్టుకుంది. ఆయా విభాగాలకు చెందిన విద్యార్థులు 488 ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. ఇందులో సైబర్ భద్రత, సౌరశక్తి, బ్యాటరీ టెక్నాలజీ, ఆటోమేషన్ తదితర ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. న్యాయ నిర్ణేతలుగా డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు వ్యవహరించారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలి

విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించేందుకు నిరంతరం శ్రమించాలని విజ్ఞాన్ సంస్థల సీఈఓ బోయపాటి శ్రవణ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దుర్గసుకుమార్ సూచించారు. ఇన్నోవేటివ్ ఎక్స్‌పో సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలను వెలికితీయడానికి ప్రతి సెమిస్టర్‌లో ఇన్నోవేటివ్ ఎక్స్‌పోలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విద్యార్థుల్లో ఆధునిక సాంకేతిక లక్ష్యాలను పెంపొందించడానికి ఎక్స్‌పోలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోదాదేవికి విశేష పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం గోదాదేవికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గోదాదేవి అమ్మవారు, శ్రీరంగనాథుడిని కొలుస్తూ పాశురాలు ఆచార్యులు పఠించారు. అమ్మవారికి ఇష్టమైన కట్టెపొంగలిని ఆరగింపుగా సమర్పించారు. అమ్మవారికి మహిళలు మంగళ హారతులు పట్టారు.

8నుంచి ఫౌండేషన్ కోర్సులో ఉచిత శిక్షణ

చౌటుప్పల్ : గ్రూప్-1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఉమ్మడి నల్ల గొండ జిల్లా బీసీ ఉపాధి నైపుణ్య శిక్షణ కేంద్రం సంచాలకులు కొప్పు విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీలతో పాటు ఈబీసీ అభ్యర్థులు ఈనెల 8నుంచి 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజర్వేషన్, డిగ్రీ మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. వార్షిక ఆదాయం రూ.5లక్షలకు మించకుండా ఉండాలని, గతంలో శిక్షణ పొందని అభ్యర్థులే అర్హులన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కుల మెమోలు, కులం, ఆదాయ ధ్రువీకరణ, పాస్‌ఫొటోలు, ఆధార్ కార్డు, టీఎస్‌పీఎస్‌సీ ఓటీఆర్ అప్లికేషన్ ఫాం స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు నల్లగొండలోని కార్యాలయంలో లేదా ఫోన్ నంబర్ 08682-220007ను సంప్రదించాలన్నారు.

పిల్లర్ల దశలోనే 'ఇంటిగ్రేటెడ్'



యాదగిరిగుట్టలో పిల్లర్ల దశలో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు

- గుట్టలో రూ.2కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం
- రెండేళ్లు కావొస్తున్నా పూర్తికాని పనులు
- బిల్లుల చెల్లింపులో జాప్యం
- పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్

యాదగిరిగుట్ట : వినియోగదారులు, కొనుగోలుదారుల సౌకర్యార్థం ఒకే చోట కూరగాయలు, పండ్లు, పూలు, మాంసం ఇలా పలు రకాల ఉత్పత్తుల క్రయవిక్రయాలు చేపట్టేలా యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో చేపట్టిన సమీకృత మార్కెట్‌ల పనులు ముందుకు కదలడం లేదు. మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.2కోట్ల చొప్పున కేటాయించింది. రెండు సంవత్సరాలు కావస్తున్నా పనులు బేస్మెంట్, పిల్లర్ల దశలోనే ఉన్నాయి.

వర్షాల సాకుతో పనులు నిలిపివేత

యాదగిరిగుట్టలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులకు 2022 మార్చి 23వ తేదీన శంకుస్థాపన చేశారు. ఆరు నెలల్లో పూర్తి చేసి ప్రారంభిస్తామని అధికారులు, కాంట్రాక్టర్లు చెప్పారు. కానీ, పనులు బేస్మెంట్, పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. జూన్, జూలైలో వర్షాల కారణంగా పనులు నిలిచిపోయాయని కాంట్రాక్టర్ చెబుతున్నాడు. కానీ, ఆ తర్వాత వర్షాలు తగ్గినా పనులు ప్రారంభించలేదు. గత ఏడాదే మార్కెట్ అందుబాటులోకి రావల్సి ఉంది. కానీ పనులు జరుగుతున్న తీరు చూస్తుంటే ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి లేదు.

అన్నీ ఒకే చోటా..

యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని అంగడి బజార్‌లో రెండు ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సముదాయంలో 48 మడిగెలు రానున్నాయి. ఇందులో చికెన్, మటన్, చేపల పాటు కూరగాయలు, పూల దుకాణాలను ఒకేచోట ఏర్పాటు కానున్నాయి. ప్రధానంగా యాదగిరిగుట్టలోని చికెన్, మటన్ మార్కెట్‌లో దుకాణాలను ఇంటిగ్రేటెడ్ దుకాణ సముదాయంలోకి తరలించాలని అధికారులు యోచిస్తున్నారు.

బిల్లులు రాకపోవడం వల్లే..

రూ.2 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ప్రారంభించారు. కానీ, కాంట్రాక్టర్‌కు గత ప్రభుత్వం పూర్తిగా బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేశాడు. పనుల జాప్యానికి ఇదే కారణమని తెలుస్తోంది.

బిల్లు రాలేదని పనులు ఆపేశాడు



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి టీఎఫ్ఐడీసీ నిధుల్లో రూ.2 కోట్లు కేటాయించాం. ప్రస్తుతం పనులు పిల్లర్ల దశలో నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు పూర్తిస్థాయిలో బిల్లులు రాకపోవడంతో పనులు ఆపేశాడు. బిల్లులు వస్తే పనులను త్వరగా పూర్తి చేసి మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకువస్తాం.

– అజయ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, యాదగిరిగుట్ట

నవ్వులు విరిసేనా!

- ఆపరేషన్ స్మైల్-8 ప్రారంభం
- పనుల్లో మగ్గుతున్న బాలల గుర్తింపునకు మూడు బృందాలు
- పరిశ్రమలు, హోటళ్లలో తనిఖీలు
- గుర్తించిన చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించడమే లక్ష్యం



భువనగిరిలోని ఓ పరిశ్రమలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

భువనగిరి : బాల్యం బందీ అవుతోంది. చదువుకోవాల్సిన వయస్సులో బట్టీల్లో ఇటుకలు మోస్తున్నారు. హోటళ్లు, దుకాణాలు, పరిశ్రమల్లో వెట్టిచాకిరీ చేస్తున్నారు. నిరాధరణకు గురై రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్లలో దర్శనమిస్తున్నారు. చిత్తుకాగితాలు ఏరుతూ కాలం గడుపుతున్నారు. ఇటువంటి వారిని గుర్తించి విముక్తి కల్పించేందుకు ఏటా జనవరిలో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 1నుంచి పోలీస్, కార్మిక, విద్య, మహిళా,శిశు సంక్షేమ, రెవెన్యూ శాఖలు మరియు స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని చేపట్టాయి.

గుర్తించిన చిన్నారులు ఇలా..

సంవత్సరం	బాలికలు	బాలురు
2017	191	196
2018	18	46
2019	18	20
2020	11	36
2021	11	03
2022	01	01
2023	02	05
మొత్తం	252	304

గుర్తించిన చిన్నారులకు సంరక్షణ కేంద్రాల్లో ఆశ్రమం

ఆపరేషన్ స్మైల్ ద్వారా గుర్తించిన చిన్నారుల సంరక్షణకు జిల్లాలో ఎనిమిది బాలల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో భువనగిరిలో 3, ఆలేరులో 2, బొమ్మల రామారం, తుర్కపల్లి, వలిగొండలో ఒక్కోటి చొప్పున ఉన్నాయి. తనిఖీల్లో గుర్తించిన బాలలకు ఆయా కేంద్రాల్లో తాత్కాలికంగా రక్షణ కల్పించి సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తారు. తల్లిదండ్రులు వస్తే కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగిస్తున్నారు. తల్లిదండ్రులు రాని చిన్నారులను సంరక్షణ కేంద్రాల్లోనే ఆశ్రమం కల్పిస్తారు. వీటితో పాటు భువనగిరిలో బాలసదన్, గ్రేస్, తుర్కపల్లిలో ఆదరణ కేంద్రాల్లో చిన్నారులకు ఆశ్రమం కల్పించి తల్లిదండ్రులు రాగానే అప్పగిస్తారు.

తనిఖీలకు మూడు బృందాలు

బాలలను గుర్తించడానికి మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.ఒక్కో టీంలో ఎనిమిది మంది ఉంటారు. వీరిలో ఒక ఎస్ఐ, నలుగురు కానిస్టేబుల్స్(ఒకరు స్త్రీ), బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది ఉంటారు. ఈ బృందాలు భువనగిరి, చౌటుప్పల్, యాదగిరిగుట్ట డివిజన్‌లలో తనిఖీలు నిర్వహిస్తున్నాయి.

ఏడు విడతల్లో 582 మంది గుర్తింపు

తప్పిపోయిన, భిక్షాటన చేస్తున్న చిన్నారులు, బాలకార్మికులు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో తిరుగున్న బాలలు, ఇంటినుంచి పారిపోయి వచ్చిన వారు, పరిశ్రమలు, దుకాణాలు, దాబాలు, హోటళ్లు, ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న చిన్నారులను ఆపరేషన్ స్మైల్‌లో గుర్తిస్తారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఏర్పడిన తర్వాత 2017నుంచి ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన ఏడు విడతల్లో 582 మంది బాలలను గుర్తించారు. ఇందులో బాలికలు 252, బాలురు 330 మంది ఉన్నారు. ఈనెల 1నుంచి ప్రారంభమైన 8వ విడత ఆపరేషన్ స్మైల్ 31వ తేదీ వరకు కొనసాగనుంది.

బాలలను పనిలో పెట్టుకోవద్దు

ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ద్వారా గుర్తించిన చిన్నారులను వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగిస్తాం. తల్లిదండ్రులు వచ్చే వరకు బాలల సంరక్షణ కేంద్రాల్లో ఆశ్రమం కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తాం. బాలలను పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి. పరిశ్రమలు, హోటళ్లు, దుకాణాలు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు ఇలా ఎక్కడైనా చిన్నారులు తిరుగుతూ కనిపిస్తే అధికారుల దృష్టికి తేవాలి.

– అన్నపూర్ణ, ఐసీడీఎస్ పీడీ

గుట్టలో వంట గ్యాస్ కొరత

- వారం రోజులైనా అందని సిలిండర్
- ఇబ్బందుల్లో వినియోగదారులు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో హెచ్‌పీ గ్యాస్ కొరత ఏర్పడింది. బుక్ చేసి వారం రోజులైనా సిలిండర్ రాకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. యాదగిరిగుట్టతో పాటు తుర్కపల్లి, రాజాపేట మండలాల్లో సుమారు 20 వేల గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయి. వీటికి యాదగిరిగుట్టలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నుంచి సిలిండర్లు సరఫరా చేస్తారు. ప్రస్తుతం గ్యాస్ కొరత కారణంగా రోజూ 500కు పైగానే సిలిండర్లు వినియోగారులకు సరఫరా కావడం లేదు.

గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఏమంటున్నారంటే..

ఇటీవల డీజిల్ ట్యాంకర్లు, లారీల యజమానులు చేపట్టిన సమ్మె కారణంగా గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోవడతో కొరత ఏర్పడిందని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. సోమవారం వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉండగా ఎజెన్సీలో పనిచేసే ఓ వ్యక్తి కొన్ని సిలిండర్లను నిల్వ చేసి అధిక ధరకు విక్రయిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో క్రీస్తు సాక్షాత్కార ఉత్సవాలు

- క్రీస్తు సందేశాన్ని వినిపించిన కార్డినల్ పూల ఆంథోని
- రెండో రోజు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కేతేపల్లి: కేతేపల్లిలోని మేరి జపమాల మాత చర్చిలో క్రీస్తు సాక్షాత్కార (ముగ్గురు రాజుల పండుగ) ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు శనివారం ఉదయం స్థానిక చర్చి ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక చర్చి విచారణ గురువు మాదాను ఫ్రాన్సిస్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు పొరుగు జిల్లాల్లోని వివిధ చర్చిలకు చెందిన 100మంది క్రైస్తవ మత గురువులు, మత కన్యలు, ఏసుక్రీస్తు భక్తులు పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్డినల్ పూల ఆంథోని క్రీస్తు సందేశాన్నిచ్చారు. ప్రజల కోసం తన రక్తాన్ని చిందించిన ఏసు ప్రభువు లోక రక్షకుడని అన్నారు. దేవుడే క్రీస్తు రూపంలో జన్మించి మానవ కల్యాణానికి పాటుపడ్డారని పేర్కొన్నారు. క్రీస్తు సందేశాలు పాటిస్తే శుభాలు కలుగుతాయని అన్నారు. ఏసుక్రీస్తు బోధనలు పాటించి నిర్మల జీవితాన్ని గడపాలన్నారు. పార్థనల అనంతరం క్రైస్తవులకు దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు. వేడుకల్లో జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు పసల శౌరయ్య,



కేతేపల్లి : వేడుకలో ప్రసంగిస్తున్న కార్డినల్ పూల ఆంథోని

చర్చి కమిటీ ప్రతినిధులు పసల ఆరోగ్యయ్య, మాదాను బాలస్వామి, ఆర్లగడ్డ అమర్, జోసఫ్, విజయ్‌రాజు, విజయ్‌కుమార్, పసల దనరాజ్, పాలిశెట్టి జోజప్ప, శౌరి, గుద్దింటి రాయప్ప, క్రైస్తవులు బందా లూబెల్, కాల్వ శౌరయ్య, పసల రవి, జార్జి, అవ్వారి రాయప్ప పాల్గొన్నారు.

జాతరకు భారీగా తరలి వచ్చిన ప్రజలు

ముగ్గురు రాజుల పండుగ సందర్భంగా స్థానిక చర్చిలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏటా చర్చి ఆవరణలో పెద్ద జాతర నడుస్తోంది. చర్చి వెలుపల వెలిసిన పిల్లల ఆటల వస్తువులు, మహిళల అలంకరణ వస్తువులు, తిను బండారాలు, తదితర దుకాణాలతో వీధి కిక్కిరిసి పోయింది. జాతరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు భారీగా తరలివచ్చారు. చర్చిలో ప్రత్యేకంగా నిర్మించిన మేరీ మాత విగ్రహం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వేళ మేరి మాత విగ్రహాన్ని, ఏసు శిలువను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ప్రదర్శన నిర్వహించారు.



ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

- భూమి పట్టా మార్పిడి కేసుకు రైతును డబ్బులు డిమాండ్ చేసిన తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్
- ఏసీబీ అధికారులను ఆశ్రయించిన బాధితుడు
- కార్యాలయంలో రాత్రి వరకు అధికారుల సోదాలు
- పలు రికార్డులు స్వాధీనం.. సీనియర్ అసిస్టెంట్‌పై కేసు

నకిరేకల్ : భూమి మార్పిడి కోర్టు కేసు విషయంలో డబ్బులు డిమాండ్ చేసిన నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి 9గంటల వరకు ఏసీబీ అధికారులు తహసీల్దార్ కార్యాయంలో సోదాలు నిర్వహించి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన కొమ్మనబోయిన కిష్టయ్యకు సర్వే నంబర్ 15/2లో ఉన్న రెండు ఎకరాల భూమిని తనకు రాసిచ్చారని, తన పేరిట ధరణిలో పట్టా చేయాలని అదే గ్రామానికి చెందిన కిష్టయ్య అల్లుడు శ్రీనివాస్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులను సంప్రదించాడు. అధికారులు పట్టా మార్పిడి చేయకపోవడంతో శ్రీనివాస్ హైకోర్టును ఆశ్రయించాడు. ఆ భూమిని శ్రీనివాస్ పేరిట పట్టా చేయాలని కోర్టు తీర్పు కూడా ఇచ్చింది. అయితే కోర్టు ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో శ్రీనివాస్ మళ్లీ కోర్టును ఆశ్రయించాడు. ఈ విషయం తెలుసుకున్న కిష్టయ్య కుమారుడు కొమ్మనబోయిన వెంకటేష్ కూడా కోర్టులో కేసు వేశాడు. ఈ క్రమంలోనే ధరణిలో పట్టా చేయాలని కోరుతూ కొద్ది రోజుల క్రితం వెంకటేశ్ నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకన్నను సంప్రదించాడు.



ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్

కోర్టు ఖర్చులకు రూ.65 వేలు కావాలని..

కంటెమ్ట్ కేసు విషయంలో అనుకూలంగా తీర్పు రావాలంటే కోర్టులో కార్యాలయ పరంగా కేసు వేయాల్సి ఉంటుందని సీనియర్ అసిస్టెంట్ వెంకన్న తెలిపాడు. కోర్టు ఖర్చులకు రూ.65వేలు కావాలని వెంకటేశ్‌ను డిమాండ్ చేశాడు. దీంతో సదరు బాధితుడు వెంకటేశ్ ఏసీబీ అధికారులకు వారం క్రితమే ఫిర్యాదు చేయగా అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయంలో పూర్తి ఆధారాలు సేకరించేందుకు నల్లగొండ ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు రామారావుల నేతృత్వంలో అధికారులు శనివారం నకిరేకల్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో సోదాలు చేశారు. సంబంధిత సీనియర్ అసిస్టెంట్ వెంకన్న దగ్గర ఉన్న రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సీనియర్ అసిస్టెంట్ వెంకన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.

క్లుప్తంగా

బస్సును ఢీకొట్టిన లారీ.. ఆరుగురికి గాయాలు

మోతె : లారీ అదుపుతప్పి ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మోతె మండల పరిధిలోని మామిళ్లగూడెం వద్ద శనివారం చోటు చేసుకుంది. ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు వెళ్తోంది. మార్గమధ్యలో మామిళ్లగూడెం వద్ద ముందు వెళ్తున్న డీసీఎం టైరు పగిలిపోయింది. ఈ క్రమంలో బస్సు డ్రైవర్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న లారీ వేగనియంత్రణ కాక వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ అప్రమత్తతో వ్యవహరించి బస్సును రోడ్డు పక్కకు దించడంతో పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లికి చెందిన బైరబోయిన కాంతమ్మ(100) వయోభారంతో శనివారం మృతిచెందింది. మృతురాలికి నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతురాలు కాంతమ్మ ఇప్పటికే తన వంశానికి చెందిన మూడు తరాల వారిని చూసింది. మొన్నటి వరకు ఆరోగ్యంగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

బైక్‌ల అపహరణ కేసులో ఇద్దరి అరెస్ట్

కొండమల్లేపలి : బైక్‌ల అపహరణ కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. శనివారం కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్‌ఐ వీరబాబులు నిందితుల వివరాలు వెల్లడించారు. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన బోడ యాదయ్య బైక్‌ను గత ఏడాది అక్టోబర్ 27న గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు తిప్పర్తి మండలం కాజీరామారం గ్రామానికి చెందిన గంటె కంపు మధుకుమార్, కోదాడకు చెందన కారం శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించారు. వీరు నకిరేకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా మరో బైక్‌ను అపహరించినట్లు విచారణలో ఒప్పుకున్నారు. వారి వద్ద రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు. సమావేశంలో ఏఎస్‌ఐ ఆంజనేయులు, హేమానాయక్, గురువారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం

నార్కట్‌పల్లి : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నార్కట్‌పల్లి, వేములపల్లి, తిప్పర్తి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన పాల సంఘం మాజీ చైర్మన్ ముద్దం రామచంద్రం తన సోదరుడు అంజయ్యతో కలిసి బైక్‌పై రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో అక్కెనపల్లి గ్రామ శివారుకు వెళ్లగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామచంద్రం అక్కడికక్కడే మృతిచెందగా ఆయన సోదరుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ నర్సిరెడ్డి తెలిపారు.

లారీ బోల్తా పడి క్లీనర్ మృతి

వేములపల్లి : లారీ అదుపుతప్పి బోల్తా పడడంతో క్లీనర్ మృతిచెందగా డ్రైవర్, మరో క్లీనర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన వేములపల్లి మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. బేకరీకి సంబంధించిన ముడి పదార్థాలతో ఓ లారీ నెల్లూరు నుంచి ముంబాయికి బయలుదేరింది. మార్గమధ్యలో వేములపల్లి మండల కేంద్రంలోని గంగదేవమ్మ గుడి వద్ద అదుపుతప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన లారీ క్లీనర్ వాన్వె ఆశీశ్‌బాలు (18) అక్కడికక్కడే మృతిచెందగా మరో క్లీనర్ దోత్రె రాహుల్, లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వీరిని తొలుత మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తే కారణమని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు బోల్తాపడిన లారీని క్రేన్ సహాయంతో బయటికి తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.



వేములపల్లి : క్రేన్ సహాయంతో లారీని బయటికి తీయిస్తున్న పోలీసులు

తిప్పర్తిలో కారు డ్రైవర్..

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన శనివారం తిప్పర్తి మండలంలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ పట్టణం బంగారిగడ్డకు చెందిన మహ్మద్ ఆసిఫ్(36) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు నెలల క్రితం తండ్రి మరణించడంతో నిద్ర చేసేందుకు శుక్రవారం తల్లి సుల్తానాను హైదరాబాద్‌లో బంధువుల వద్ద దించేందుకు కారులో వెళ్లాడు. తిరిగి శనివారం మిర్యాలగూడకు వస్తుండగా అనిశెట్టి దుప్పలపల్లి సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన కల్వర్టులో బోల్తా పడింది. స్థానికులు అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా చౌటుప్పల్ వద్ద మృతిచెందాడు. భార్య బీబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎన్.ధర్మా తెలిపారు. మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు.

దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

సూర్యాపేట రూరల్ : ప్రజాపాలన దరఖాస్తులను పక్కగా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని సూర్యాపేట జెడ్పీ సీఈఓ సురేష్‌కుమార్ అన్నారు. శనివారం సూర్యాపేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీని పరిశీలించి మాట్లాడారు. తప్పులు దొర్లకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ పరంకుశరావు, ఏపీఓ వెంకన్న, అధికారులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

కొండమల్లేపలి : చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు కొండమల్లేపల్లి సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జేబీ కాలనీలో నివాసముంటున్న రమావత్ పూల్‌సింగ్ ఇంట్లో జనవరి 1న గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.90వేల నగదును అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న దేవరాయ సత్యనారాయణను అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

మిర్యాలగూడ : ఎమ్మెల్సీ ఎన్నికకు పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మిర్యాలగూడ ఆర్డీఓ బి.చెన్నయ్య కోరారు. శనివారం స్థానిక తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం నల్లగొండ, ఖమ్మం, వరంగల్ నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటరు జాబితా తయారు చేసేందుకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. మండల కేంద్రాల వారీగా డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్, డివిజన్ కేంద్రంలో డీఏఓ, ఆర్డీఓలు సహాయ ఓటు నమోదు అధికారులుగా బాధ్యతలు నిర్వరిస్తున్నారని తెలిపారు. ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో ఓటు నమోదు కోసం దరఖాస్తులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. 1-11-2023 నాటికి మూడు సంవత్సరాలు ముందుగా డిగ్రీ దానికి సమానమైన తత్సమాన, డిప్లొమా, ఇంజనీరింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఓటు నమోదు చేసుకునేందుకు అర్హులని తెలిపారు.ఆయన వెంట డీఏఓ రాధ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కల్పన, సీనియర్ అసిస్టెంట్ జానీషరీఫ్ ఉన్నారు.

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డే.. 420



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, చిత్రంలో కాంగ్రెస్ నాయకులు

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను 420 అంటున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి.. జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ఆయనే అసలు 420 అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరేశం మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వ నిర్మాణం కోసం తన బీనామిలకు కాంట్రాక్ట్ ఇప్పించుకుని ఆ ప్రాంత ప్రజలకు నీళ్లు ఇవ్వకుండా జగదీష్‌రెడ్డి మోసం చేశారని, ఈ విషయంలో తాను బహిరంగ చర్చకు సిద్ధమని అన్నారు. జిల్లా మంత్రిగా ఉండి నక్కల గండి సొరంగమార్గం పనులు ఒక్క అంగుళం కూడా చేయలేదన్నారు. 'ముసలమ్మ చెట్టు ఎత్తిపోతల పథకాన్ని సంవత్సరం లోపు పూర్తి చేయకుంటే మా మంత్రి జగదీష్‌రెడ్డి రాజీనామా చేస్తాడు' అని నాగార్జునసాగర్ ఉప ఎన్నికలో స్వయంగా అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారని, ఆ పనులు పూర్తికాలేదన్నారు. దానికి బాధ్యత వహిస్తూ జగదీష్‌రెడ్డి రాజీనామా చేయాల్సి ఉండగా.. చేయలేదని, ఇప్పుడు తమ ప్రభుత్వం మీద ఆరోపణలు చేసే అర్హత జగదీష్‌రెడ్డికి ఎక్కడిదని వీరేశం ప్రశ్నించారు. జలహారతి పేరుతో కాళేశ్వరం జలాలు తీసుకవచ్చి సస్యశామలం చేస్తామని చెప్పినా జిల్లాకు చుక్క నీరూ ఇవ్వలేదని ఆరోపించారు. కృష్ణ, గోదావరి, మూసీ నదులను అనుసంధానం చేస్తామని చెసినా దాని ఊసేలేదన్నారు. 'కాంగ్రెస్ హామీలను 420 హామీలు అంటున్న నీవు.. ఆ విషయాలపై ఇద్దరం రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్దాం. నీ మోజారిటీ కంటే ఒక్క ఓటు తక్కువ వచ్చినా నేను ఎన్నిక నుంచి తప్పుకుంటాను' అని వీరేశం సవాల్ విసిరారు. నకిరేకల్ మున్సిపాలిటీలో మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారని, ఆ పనుల్లో కూడా అవినీతి జరిగిందని, కేటీఆర్ కూడా 420 అని ఆరోపించారు. ప్రజల దీవెనలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, నెల రోజుల్లోనే రెండు స్కీంలను అమలు చేశామన్నారు. మిగతా పథకాల కోసం ప్రజా పాలన ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. నిర్మాణాత్మకమైన సూచనలు చేస్తే స్వీకరిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై తప్పుడు విమర్శలు చేస్తే సహించబోమని అన్నారు. విలేకరుల సమావేశంలో చామల శ్రీనివాస్, పూజర్ల శంభయ్య, దైద రవీందర్, పన్నాల రాఘవరెడ్డి, నకిరేకంటి ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

ఆకు కూరల సాగుకు సమయమిదే

- పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ
- తక్కువ సమయంలో పంట చేతికి

పాడి పంట

పెద్దవూర: భారత ఆహార సంస్థ, వైద్య పరిశోధన మండలి సిఫార్సుల మేరకు ప్రతి ఒక్కరూ కనీసం 125 గ్రాముల ఆకు కూరలు ప్రతిరోజు ఆహారంలో తీసుకోవాలి. వీటిలో ఆరోగ్యానికి అవసరమయ్యే పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. విటమిన్ ఏ, సీ, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు అందుతాయి. బావులు, బోర్లు, ఇతర నీటి పారుదల కింద ఆకుకూరల సాగును ఆరుతడి పద్ధతిలో తక్కువ నీటితో సాగు చేపట్టడం ద్వారా అధిక లాభదాయకమని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ సూచిస్తున్నారు. ఈ నెల నుంచి ఆకుకూరల సాగు చేపట్టవచ్చునని తెలిపారు.

సాగు చేయాల్సిన ఆకుకూరలు ఇవే..

పాలకూర, తోటకూర, గోంగూర, చుక్కకూర, మెంతికూర, పుదీన, కొత్తిమీర, బచ్చలికూర ప్రస్తుతం సాగు చేసేందుకు అనుకూలంగా ఉంటాయి. తోటకూరలో ఏఆర్ఎస్ఏ రకం మంచి దిగుబడి వస్తుంది. విత్తిన 15-20 రోజులకే మొదటి కోత వస్తుంది. ఆర్క ఆరుణ, కో-1,2,3 రకాలను సాగు చేయవచ్చు. పాలకూరలో ఆల్‌గ్రీన్ రకం మేలైనది. ఇది విత్తిన 15-20 రోజుల్లోనే కోతకు వస్తుంది. 6 నుంచి 7కోతల్లో ఎకరాకు 50 టన్నుల ఆకు దిగుబడి వస్తుంది. ఆర్క అనుపమ కూడా సాగు చేయవచ్చు. మెంతికూరలో లాంసెలక్షన్-1 రకం గుబురుగా పెరుగుతుంది. ఎక్కువ ఆకు దిగుబడిని ఇస్తుంది. పూసాఎర్లీ బించింగ్ రకం కూడా తొందరగా కోతకు వస్తుంది. హిస్సార్ సువర్ణరకం కూడా పూసాఎర్లీ బంచింగ్ కంటే 20 శాతం అధిక దిగుబడి వస్తుంది. గోంగూరలో ఏఎస్‌జీఆర్ యూ-1 రకం ఎకరాకు 4-5 టన్నుల దిగుబడి వస్తుంది. ఎంఎస్-3 రకం కూడా ఎర్ర గోంగూర రకానికి చెందినదే. దీనిని కూడా తడికింద ఎప్పుడైనా సాగు చేయవచ్చు. కొత్తిమీరలో స్వాతి(సీఎస్-6) పంట కాలం 80-85 రోజులు ఉంటుంది. సాధన (సీఎస్-4) రకం పంటకాలం 100-110 రోజులు ఉంటుంది. ఇది పేనుబంకను తట్టుకుంటుంది. వీటితో పాటు కరివేపాకులో సువాసిని, డిడబ్ల్యూ 1-2 రకాలు, బచ్చలిలో ఎర్ర బచ్చలి, పుదీనాలో స్పియర్‌మింట్ వంటి రకాలు సాగుకు అనుకూలం.



తుంగతుర్తిలో సాగవుతున్న పాలకూర



సాగవుతున్న పుదీనా తోట

దిగుబడి పెంచడానికి మార్గాలు

తక్కువ కాలపరిమితి, అధిక దిగుబడులు ఇచ్చే రకాలు ఎంపిక చేసుకోవాలి. సమగ్ర ఎరువులు, సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్‌ను ఉపయోగించి విత్తన శుద్ధి చేయాలి. విత్తిన 20 రోజుల నుంచి 15 రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు కలుపు తీసి మట్టిని కదిలించాలి. విత్తే ముందు ఫ్లుక్లోరిలిన్ కలుపు మందును ఎకరాకు 800 గ్రాములు వాడాలి. ఆకు కూరల సాగుకు సాధ్యమైనంత ఎక్కువగా సేంద్రియ ఎరువులను వాడితే నేలలో తేమను ఎక్కువ కాలం పట్టి ఉంచి సూక్ష్మజీవుల చర్యలు అధికమై పోషకాల లభ్యత పెరుగుతుంది. విత్తిన వెంటనే నీరు పెట్టాలి. మరలా మూడోరోజు కూడా నీరు పెట్టాల్సి ఉంటుంది. భూమిలో తేమను బట్టి 5-7 రోజులకు తడి ఇవ్వాలి. విత్తిన మొదటిసారి నీరు పెట్టేటప్పుడు జాగ్రత్తగా నెమ్మదిగా నీరు పెట్టాలి. నీటి ఎద్దడిని తట్టుకోవడానికి రెండు శాతం యూరియా అంటే లీటరు నీటికి 20 గ్రాములు కలిపి చల్లాలి. తోటకూర సాగుకు 800 గ్రాములు, పాలకూరకు 10-12 కిలోలు, గోంగూరకు 6 కిలోలు, మెంతికూరకు 8-10 కిలోలు, కొత్తిమీరకు 4.5 కిలోలు, బచ్చలికూర సాగుకు 5-6 కిలోల విత్తనాలు అవసరం అవుతాయి.

విత్తే పద్ధతి..

పాలకూర సాగుకు వరుసల మధ్య 20 సెంటీమీటర్లు, మొక్కల మధ్య దూరం 10సెం.మీ. ఉండాలి. గోంగూరకు వరుసల మధ్య దూరం 30సెం.మీ.లు, మొక్కల మధ్య దూరం 10 సెం.మీ.లు, తోటకూరలో వరుసల మధ్య దూరం 20 సెం.మీ. మెంతికూరలో వరుసల మధ్య దూరం 25 సెం.మీ.లు, మొక్కల మధ్య దూరం 10 సెంటీమీటర్లు, బచ్చలికూరలో వరుసల మధ్య 60 సెం.మీ.లు, మొక్కల మధ్య దూరం 60 సెం.మీ.ల దూరం ఉండాలి.